www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 20 | 21-02-2022 | పుటలు : 4

# నన్నయ అభివృద్ధికి సహకరిస్తాం



## వసతిగృహాన్ని ప్రారంభించిన మంత్రి కన్నబాబు, వీసీ జగన్నాథరావు

**14.02.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. సోమవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్. ఎన్ క్యాంపస్ కాకినాడ లోని రూ.4.20 కోట్లతో నిర్మించిన పురుషుల వసతిగృహాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు కలిసి ప్రారంభించారు. హాస్టల్ భవనాన్ని పరిశీలించి, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి అందించిన ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి క్యాంపస్ ప్రిన్సిపల్ డా.ఎం.కమలకుమారి అధ్యక్షతన అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, మల్లాడి సత్యలింగం నాయకర్ 107వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అతిథులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ జిల్లాలో విద్యాసంస్థలకు కోట్ల విలువైన ఆస్తులను దానం చేసిన త్యాగశీలి మల్లాడి సత్యలింగం నాయకర్ అని కొనియాడి, 107వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థపై ఉన్న అవగాహనతో కేజీ టు పీజీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దివంగతనేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి స్థాపించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహకారాన్ని తమ ప్రభుత్వం అందిస్తుందని తెలియజేసారు. ప్రత్యేకంగా నన్నయ యూనివర్సిటీ విజ్ఞాన శాస్త్రాలనే కాకుండా సామాజిక శాస్త్రాలను కూడా అభివృద్ధి పరచాలన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో 100 పైగా వెబినార్ ల ద్వారా విశ్వవిద్యాలయానికి గుర్తింపు తెచ్చిన మొక్కా జగన్నాథరావుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆన్లైన్ కోర్సుల ద్వారా విభిన్న రకాల పాఠ్యాంశాలను విద్యార్థులకు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యా సంస్థలలో జ్ఞాపకాలను పెంపొందించుకోవాలన్నారు. ఆ దిశగా మొక్కలు నాటడం పుస్తకాలు సమకూర్చడం లేదా చిత్రకళ వంటివి కాలేజీలో అభివృద్ధి చేయడం వలన జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయన్నారు. ఉపకులపతి మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయ ఏర్పాటులో గోదావరి సాధన సమితి చేసిన కృషి గొప్పదని కొనియాడారు. గోదావరి సాధన సమితిలో జిల్లా ప్రముఖులను చేర్చుకొని విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించడం నన్నయ యూనివర్సిటీ ప్రథమ కర్తవ్యమని అందుకు అనుగుణంగా కావలసిన అన్ని రకాల సౌకర్యాలను విద్యార్థుల కోసం ఏర్పాటు చేయడం లక్ష్యమన్నారు. అలాగే విశ్వవిద్యాలయ ప్రమాణాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. క్యాంపస్ లో చదువుతోపాటు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన ప్రక్రియలను విద్యార్థులకు ప్రకృతి పట్ల బాధ్యత నేర్పించే వాటర్ హార్వెస్టింగ్, గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయడం , కాలానికి అనుగుణంగా అధ్యాపకులకు శిక్షణ ఇచ్చే విధంగా హెచ్. ఆర్. డి. సెంటర్ ను ఏర్పాటు వంటి అంశాలను విశదీకరించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీకి కావల్సిన ఐ.ఎస్.ఓ, ఏ.ఐ.సి.టి.ఇ. గుర్తింపులను తీసుకువచ్చామని, త్వరలో నాక్ గుర్తింపును తీసుకువస్తామని తెలియజేసారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ డా.ఎం.కమలకుమారి, రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ , ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్. టేకి, ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్. శేషారెడ్డి, గోదావరి సాధన సమితి డా.చిరంజీవినీ కుమారి, ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య ప్రశాంతిశ్రీ, డా.పి.వెంకటేశ్వరరావు, ఇంజనీర్ డా.ఎన్.నూకరత్నం, డా.వి.పెర్సిస్, డా.కె.రమణేశ్వరి, డా.పోచయ్య, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, కోరమండల్ యాజమాన్యం మరియు బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









## సంపాదకీయం



## భాష

భాష మహిమ మన పూర్వీకులకు బాగా తెలుసు.అందుకనే వారు పొరపాటున కూడా అమంగళకరమైన మాటలను పలకవద్దని చెబుతారు. మధురమైన, శుభకరమైన మాట వలన మంచి జరుగుతుంది.కఠినమైన, క్లిష్టమైన, అసాధ్యమైన పనులు కూడా  మధురమైన సంభాషణల వలన సఫలీకృతమౌతాయి.

ఉద్వేగం కలిగించకుండా, ప్రియంగా, హితంగా పలకటం ఒక విధమైన తపస్సు. దానిని 'వాచిక తపస్సు' అంటారు. ఏ భాష అయినా మనిషికి మృదువైన,హితమైన, ప్రియమైన మంచి మాటల్ని జనజీవన వ్యవహారంగా అందించింది. ఆ మాటలతోనే అన్ని భాషల్లోనూ కవిత్వం, పాట, కథ, నవల... ఇవన్నీ పుట్టుకొచ్చాయి.

శబ్దం యొక్క విశిష్టమైన  పరిణామమే వాక్కు. అదే భాష.సృష్టికి కారణమైన ప్రణవ నాదమే ఓంకారం. అకార,ఉకార,మకార సంయుక్తాక్షరమది. పరమాత్మ స్వరూపం. పరమేశ్వరుని ఢమరుకం నుండి శబ్దాలు ఏర్పడ్డాయట. మాహేశ్వర సూత్రాలు అంటారు. వాటిలోంచే అక్షరాలేర్పడ్డాయి. అక్షర సమూహమే వాక్కు. అది భాషగా పరిణమిస్తుంది. కొన్ని భాషలకు లిపి ఉంటుంది. లిపిలేని భాషలు ఈ ప్రపంచంలో వేలకొద్దీ ఉన్నాయి.అన్నింటిలోనూ సాహిత్యం ఉంది.

ఏ భాషలోనైనా మాట్లాడే మాటే మనిషి అల్పత్వాన్ని,ఔన్నత్యాన్ని సూచిస్తుంది.
ఉన్నతత్వాన్ని సూచించేది మౌనం లేదా సుతిమెత్తని శబ్దాలైతే, ఎక్కువ శబ్దం చేయటం అల్పత్వాన్ని సూచిస్తుంది.పాదాలను అలంకరించిన మంజీరాలు శబ్దం చేస్తుంటే, కంఠహారం చప్పుడు చేయదని కవుల చమత్కారం.

'అల్పుడెపుడు పలుకు ఆడంబరముగాను, సజ్జనుండు పలుకు చల్లగాను' అంటారు వేమన. ధ్వనించటంలో అల్పమైన కంచును, అనల్పమైన బంగారానికి సాపత్యం చెప్పారాయన.

ఏదేమైనా క్రమశిక్షణ, సంస్కారం, నియమాలతో జీవించేవారిలోంచి శుభప్రదమైన వాక్కులు, పదాలే వెలువడుతుంటాయి. శబ్దార్థ స్వరూపమైన భాషే ఈ లోకాన్ని నడిపిస్తోంది.కాళిదాస మహాకవి రఘువంశం కావ్యంలో ప్రార్థన శ్లోకంగా'వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే' అని వాక్కు, అర్థం ఆదిదంపతుల స్వరూపమని వర్ణించారు.


కాబట్టి దైవ స్వరూపమైన భాషను మనలోంచి మంచిమాటలుగా,ఎదుటివారికి మహదానందాన్ని కలిగించేవిగా, సమాజ హితాన్ని, చైతన్యాన్ని కలిగించేవిగా వర్తించటమే మనం చేయదగిన పని.బహుశా భాషా దినోత్సవాల పరమార్థం ఈ కర్తవ్యాన్ని గుర్తు చేయటానికే కాబోలును!!

# ప్రకృతి ఒడిలో తరగతులు


ఓపెన్ క్లాస్ లో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విద్యార్థులు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విద్యార్థులకు రాజానగరం రాధేయపాలెంలోని తోటలలో శనివారం ఓపెన్ క్లాస్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ ఒ.ఎస్.డి.మరియు విభాగ ఆచార్యులు ఎస్.టేకి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విద్యార్థులకు ప్రతీ సెమిస్టర్ లో ఒకసారి ఓపెన్ క్లాసులను నిర్వహిస్తున్నామని అన్నారు. ఓపెన్ క్లాసుల ద్వారా విద్యార్థుల మానసిక స్థితి మారుతుందని ఒత్తిళ్ళు దూరమవుతాయని తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ సృజనాత్మకంగా నిర్వహించే ఓపెన్ క్లాసులతో విద్యార్థులకు మానవ మనుగడకు కారణమైన ప్రకృతిపై మక్కువ ఏర్పడుతుందని చెప్పారు. ఓపెన్ క్లాసులకు విద్యార్థులు ఎంతో ఆసక్తిగా హాజరవుతున్నారని తెలిపారు.యూనివర్సిటీలోని  కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ లోని అన్ని కార్యక్రమాలకు సహకరిస్తున్న వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధ్యాపకులు డా.పి.ఉమామహేశ్వరి, డా.ఎన్.ఉదయ్ భాస్కర్, డా.రాజేంద్రప్రసాద్, డా.వల్లి, డా.ఆలీస్ జోయ్, డా.రవిశంకర్, డా.రమేష్, డా.మల్లిడి అమ్మిరెడ్డి, డా.ఐ.ఎస్.ఎన్.రాజు, డా.జోహార్ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన వీసీ


పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న అధికారులు

**19.02.22 (మీడియాసెల్)** ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ ఉభయగోదావరి జిల్లాల్లోని డిగ్రీ 2వ సెమిస్టర్ బి.ఏ, బి.కామ్, బి.బి.ఏ, బి.ఎస్సీ, బి.సి.ఎ, ఒకేషనల్ కోర్సులలో మొత్తం 30236 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసారని వారిలో 15228 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు చెప్పారు. ఉత్తీర్ణతా శాతం 50.36 గా ఉందని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునని అన్నారు. కొవిడ్ సమయంలో సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన విశ్వవిద్యాలయ పరీక్షా విభాగ అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఒ.ఎస్.డి. ఆచార్య ఎస్. టేకి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్. లింగారెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ ఎన్. సత్యనారాయణ పాల్గొన్నారు.

# వృద్ధుల సేవలో నన్నయ విద్యార్థులు

### వృద్ధాశ్రమంలో పుట్టినరోజు వేడుక

### పుట్టినరోజు వేడుకలకు ఆడంబరంగా



**15.02.22 (మీడియాసెల్)** ధనం వృధా చేయకుండా, వృద్ధులకు ఆసరాగా  ఉండే కార్యక్రమాలు చేయాలని  ఆదికవి నన్నయ విశ్వ విద్యాల యం విద్యార్థులు తమ చేతలతో నిరూ పించారు. ఎం.ఎస్.సి. అప్లైడ్ మేథమెటిక్స్ సెకండ్ ఇయర్ విద్యార్థి కుమారి కట్టా సుస్మితా శైలు పుట్టినరోజును విద్యార్థులు మంగళవారం వీరభద్రపురం లోని  కస్తూర్బాగాంధీ వృద్ధుల ఆశ్రమంలో నిర్వహించారు. ఎండి అస్రా సిమ్రోస్ నేతృత్వంలో పుట్టినరోజు వేడుక జరిగింది.వృద్ధులకు నిత్యావసరమైన వస్తువులను బహూకరించారు. మానవసేవే మాధవసేవగా భావించి తన స్నేహితులు పుట్టిరోజును ఆశ్రమంలో నిర్వహించడం ఎంతో సంతోషం కలిగిస్తోందని సుస్మితా శైలు తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ ఫ్రెండ్లీ సొసైటీ నిర్వాహకులు అమీర్ పాషా, బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు పాత్రుని నిదిత, ఉల్లంపర్తి నవీన్, కరణం సత్య అన్నపూర్ణ, గాయత్రి తదితర మిత్రులు పాల్గొన్నారు.




# ప్రిన్సిపాల్ సెక్రటరీని కలిసిన ఒ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి

**17.02.22 (మీడియాసెల్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఐ.ఎ.ఎస్. ను ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఒ.ఎస్.డి.) ఆచార్య ఎస్.టేకి మర్యాద పూర్వకంగా కలిసారు. గురువారం ఆంధ్రప్రదేశ్ సెక్రటరేట్ లో ప్రిన్సిపాల్ సెక్రటరీని తమ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఒ.ఎస్.డి. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇటీవల సాధించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నాయకత్వంలో విశ్వవిద్యాల యం సాధించిన ఎ.ఐ.సి.టి.ఇ., ఐ.ఎస్.ఓ. గుర్తింపులు మరియు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన వెబినార్స్ విశేషాలను తెలియజేసామన్నారు.


ప్రిన్సిపాల్ సెక్రటరీని కలిసిన ఒ.ఎస్.డి.

# ఉద్యోగావకాశాలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీ మరియు ఇంజనీరింగ్ పరిధిలో ఉన్న ఉద్యోగాలు మాత్రమే కాకుండా ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగాలవైపు దృష్టి సారించి వాటిని అందిపుచ్చుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ ఏ.సి.ఇ. ఇంజనీరింగ్ అకాడమి సహకారంతో "ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు" అనే అంశంపై నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. ఇంజినీరింగ్ అనేది సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధితో పాటు కొత్త విభాగాలు మరియు శాఖలతో కూడిన బహుళ-క్రమశిక్షణ కలిగిన రంగమని అన్నారు. మార్కెట్‌లలో ట్రెండ్‌లతో సంబంధం లేకుండా ఇంజనీర్లకు ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్ మరియు కంప్యూటర్‌లలో డిమాండ్ ఉందన్నారు. భారతీయ ఇంజనీర్లకు తార్కిక మరియు గణిత నైపుణ్యాలలో మంచి పట్టు ఉంటుందన్నారు. ఇతర విదేశాలలో భారతీయ ఇంజనీర్లకు డిమాండ్ ఎల్లప్పుడూ ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ప్రతి విద్యార్థిలో ఉన్న ప్రతిభను గుర్తించడం, వెలికితీయడం మరియు పెంపొందించడం అధ్యాపకుల బాధ్యత అని గుర్తు చేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులందరూ తమ ప్రతిభను గుర్తించి తగిన మార్గంలో పయనించాలని తెలిపారు. ఏ.సి.ఇ ఇంజనీరింగ్ అకాడమి ఫ్యాకల్టీ ఎస్.ఎం.ఎం.త్రినాథ్ ప్రస్తుత కాలంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ ఉపాధి అవకాశాలను వివరించారు. ప్రభుత్వోద్యోగాలలో రాణించడానికి అవసరమైన సూచనలను అందించారు. ఇంజనీరింగ్ విద్యార్థులంతా గేట్ లో అర్హత సాధించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డా.వి.పెర్సిస్, అర్గనైజింగ్ సెక్రటరీ ఏ.ఎం.శిరీష అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాలలో హస్త కళల ప్రదర్శన



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి స్త్రీల కళాశాలలో విద్యార్థినులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఏర్పాటు చేయబడిన " హేండి క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్" ను కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.రాఘవ కుమారి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్దినులచే స్వయంగా చేతితో తయారు చేయబడిన పెయింటింగ్ గృహ అలంకరణ వస్తువులు , వాల్ డెకర్స్ , మట్టిబొమ్మలు , అద్భుతమైన కళాఖండాలు, కందుకూరి దంపతుల వేషధారణ , జానపద కళాకారిణిలు, దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాన్ని సంస్కృత విభాగాధిపతి ఆర్.రాజేశ్వరి మార్గదర్శకంలో హిందీ విభాగాధిపతి డా.కె.నీరజ, ఎ.వి.ఎన్.డి. శ్రీనివాస్.వి ఉమాజ్యోతి ,కె.ఎస్.అన్నపూర్ణ దేవి , పి.కుసుమ కామేశ్వరి , పి.విజయలక్ష్మి , కె.చిన్నిబాబు నిర్వహించారు. ఐక్యుఎసి కోఆర్డినేటర్ డా.బి.అనురాధ ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటైనది.

# జి.ఎస్.ఐ. ఫీల్డ్ ట్రైనింగ్‌లో నన్నయ జియాలజీ విద్యార్థులు




జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన "ఫీల్డ్ ట్రైనింగ్ ఆన్ మేపింగ్ అండ్ ఎక్స్ ప్లోరేషన్"లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ జియాలజీ విద్యార్థులు శిక్షణ పొందారు. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం మండలం బూరుగుబంద లోని ఈ నెల 11వ తేదీ నుండి 14వ తేదీ వరకూ బెసిగ్స్ ఆఫ్ మ్యాప్పింగ్, స్ట్రక్చర్ అండ్ ప్లోటింగ్ ఆఫ్ డేటా, ఎక్స్ ప్లోరేషన్ టెక్నిక్స్, డ్రిల్లింగ్, కోర్ లాగింగ్ అండ్ సాప్లింగ్ వంటి వాటిపై శిక్షణను అందించారు. జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ డా.అపూర్భ బెనర్జీ (Dr.Apurba Banerjee) పర్యవేక్షణలో జరిగిన ఈ ఫీల్డ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ లో జియాలజీ విద్యార్థులు పలు కీలక అంశాలను గ్రహించారు. శిక్షణ పూర్తయిన అనంతరం మంగళవారం యూనివర్సిటీలోని జియాలజీ విభాగాన్ని డైరెక్టర్ డా.అపూర్భ బెనర్జీ, జియాలజిస్టులు ధనంజయ కుమార్ జరియ, వి.పెరియసామి సందర్శించారు. శిక్షణలో విద్యార్థులు నేర్చుకున్న పలు అంశాలను గూర్చి ప్రస్తావించారు. యూనివర్సిటీ జియాలజీ విభాగం తరుపున జి.ఎస్.ఐ. బృంద సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, విభాగాధిపతి డా.కె.నూకరత్నం, ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.కె.వి.స్వామి, డా.కె.శామ్యూల్ పీటర్, విభాగాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నన్నయలో ఎగ్జిక్యూటీవ్ ఎంబీఏ, ఇంటిగ్రేటెడ్ ఎం.బి.ఏ ప్రోగ్రామ్స్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు సంవత్సరాల ఎగ్జిక్యూటీవ్ ఎంబీఏ ప్రోగ్రామ్ మరియు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్ లకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రారంభిస్తున్న ఎగ్జిక్యూటీవ్ ఎంబీఏ మరియు ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సులు వివరాలను వీసీ తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా ఎగ్జిక్యూటీవ్ ఎంబీఏ మరియు ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ (మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) నూతన ప్రోగ్రామ్ లను ప్రారంభిస్తున్నామని అన్నారు. రెండు సంవత్సరాల ఎగ్జిక్యూటీవ్ ఎంబీఏ ప్రోగ్రామ్ చేయడానికి కనీసం రెండు సంవత్సరాల పారిశ్రామిక అనుభవంతో పాటు ఏదైన డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని చెప్పారు. ఎగ్జిక్యూటీవ్ ఎంబీఏ క్లాసులు సాయంత్రం సమయంలో నిర్వహిస్తారని తెలిపారు. అలాగే ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్ కు ఇంటర్మీడియట్, 10о2 లో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్ లో మూడు సంవత్సరాల కోర్సు పూర్తి చేసిన తరువాత బీబీఏ డిగ్రీ తీసుకొని నిష్క్రమించవచ్చునని, లేనిచో మిగిలిన రెండు సంవత్సరాలు బిబిఏ మరియు ఎంబీఏ డిగ్రీలు లభిస్తాయని తెలిపారు. మూడు సంవత్సరాల డిగ్రీ తీసుకుని కొన్ని సంవత్సరాలు బిజినెస్ లేదా ఇతర వ్యాపకాలు చేసుకొనిన మరల ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి అర్హత లభిస్తుందని, విద్యార్థుల సౌకర్యార్థం రిఎంట్రీ అవకాశాన్ని కల్పించామని చెప్పారు. ఈ అవకాశం అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎగ్జిక్యూటీవ్ ఎంబీఏ మరియు ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్స్ కు అర్హత, అసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ www.aknu.edu.in లేదా డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ 0883-2566011, 7093008477 నెంబర్లను సంప్రదించాలని తెలియజేసారు.

# విద్యార్థులకు సివిల్ సర్వీస్‌పై శిక్షణ ఇవ్వండి



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు సివిల్ సర్వీస్ పై మక్కువను పెంచి వారికి అవసరమైన శిక్షణను, ప్రోత్సాహాన్ని అందించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అడ్ హాక్ టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్టర్ అయిన సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును అధ్యాపకులు కలిసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ మరియు మైనార్టీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కు విశ్వవిద్యాలయంలో సివిల్ సర్వీస్, గ్రూప్ 1,2-3 మరియు ఇతర పోటీ పరీక్షలకు అధ్యాపకులు ఉచిత శిక్షణను అందించాలని అన్నారు. దీనికి సంబంధించి డా.బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సంక్షేమానికి సహకరిస్తానని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అడ్ హాక్ టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డా.తరపట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు డా.జి.రాజేంద్రప్రసాద్, డా.బి.హీరా, కార్యదర్శి డా.జె.పీటర్ కుమార్, సహకార్యదర్శి డా.ఎన్.రాజశేఖర్, డా.ఎల్.మధుకుమార్, కోశాధికారి డా.కె.కమలాకర్, మహిళా ప్రతినిధులు డా.ఎన్.సుజాత, డా.కీర్తి మరీట, డా.పి.హేమలత, కార్యనిర్వాహక సభ్యులు డా.ఎన్.కిరణ్ చంద్ర, డా.డి.ఎస్.ఆర్.ఎస్.ప్రకాష్, డా.ఎం.సత్యనారాయణ, డా.ఎ.లావణ్యకుమారి, డా.జి.ఎలీషాబాబు, డా.డి.అజయ్ రత్నం, డా.ఎం.భాస్కర్, డా.పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ విశేషం




ఫిబ్రవరి 21న ప్రపంచ వ్యాప్తంగా 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' గా జరుపుకుంటారు. ప్రపంచంలో భాషా,సాంస్కృతిక వైవిధ్యాన్ని, బహుభాషావాదాన్ని పెంపొందించడానికి, అలాగే మాతృభాషలకు సంబంధించిన అవగాహన పెంపొందించడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. కానీ ఈ రోజు వెనుక ఉన్న చరిత్ర,యునెస్కో ఈ రోజును అంతర్జాతీయ దినోత్సవంగా ఎందుకు ప్రకటించిందనేది తెలుసుకోవాలి.

నిజానికి ఈ రోజున 1952లో బంగ్లాదేశ్ లోని ఢాకా విశ్వవిద్యాలయ విద్యార్థులు, కొందరు సామాజిక కార్యకర్తలు తమ మాతృభాష బంగ్లా ఉనికిని కాపాడుకోవాలని నిరసన ప్రదర్శన నిర్వహించారు. అప్పటి పాకిస్తాన్ ప్రభుత్వం పోలీసులతో నిరసనకారులపై కాల్పులు జరపడంతో ఈ నిరసన వెంటనే మారణహోమంగా మారింది. ఈ ప్రమాదంలో 16 మంది మృతి చెందారు.

1999లో యునెస్కో తొలిసారిగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఈ ప్రధాన భాషా ఉద్యమ అమరవీరులసంస్మరణార్థం ప్రకటించింది. బంగ్లా మాట్లాడే వారి మాతృభాషప్రేమ కారణంగా ఈ రోజును ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నామని చెప్పవచ్చు.

యునెస్కో ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 6000 భాషలు మాట్లాడుతున్నారు. 1961 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 1652 భాషలు మాట్లాడుతుంటారు. ఇందులో లిపి లేని భాషలే ఎక్కువ.

## ఛత్రపతి శివాజీ జయంతి

( ఫిబ్రవరి 19 )



పుట్టిన భూమిపైన, ప్రజల పైన ప్రేమ, పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం, పరాక్రమం, పనిపట్ల అంకితభావం, మచ్చలేని వ్యక్తిత్వం, అనుచరులకు, ప్రజలకు ఆదర్శంగా నిలిచిన భారతీయ పాలకుడు శివాజీ మహారాజ్. ఈ లక్షణాలే ఆయనను గొప్ప పాలకుడిగా నిలబెట్టాయి. దేశం గర్వించదగిన వ్యక్తిగా అందరి హృదయాల్లో మిగిలిన చక్రవర్తి శివాజీ మహారాజ్. అక్షర నీరాజనంతో జయంతి శుభాకాంక్షలు!!

– నన్నయవాణి

## పోలవరం ప్రాజెక్టును సందర్శించిన నన్నయ ఇంజనీరింగ్ విద్యార్థులు

**17.02.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఆదివారం పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను పోలవరం ప్రాజెక్టుకు తీసుకువెళ్లి ప్రాజెక్టు యొక్క విశిష్టతను అధ్యాపకులు వివరించారు. సివిల్ ఇంజనీరింగ్ మెకానికల్ ఇంజనీరింగ్ కు సంబంధించి ఎన్నో క్రొత్త అంశాలు ఈ ప్రాజెక్టు ద్వారా విద్యార్థులు తెలుసుకున్నారు. రిజర్వాయర్, కాలువలు, ఆనకట్ట, కాఫర్ డ్యాం, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను విద్యార్థులు పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.


పోలవరం ప్రాజెక్టులో నన్నయ ఇంజనీరింగ్ విద్యార్థులు

## అమ్మా... నీదే ఈ జన్మ !!



పదాలు పలుకని పెదాలకు
అమృతం అమ్మ
భాషలకందని భావాలకు
స్నేహమూర్తి అమ్మ
పలుకులు నేర్పే
తొలి గురువు అమ్మ
ప్రవర్తనను సరిచేసే
పర్యవేక్షకురాలు అమ్మ
నవ మాసాలు మోసి బిడ్డకు
జన్మ నిచ్చే అమ్మ
ప్రసవ వేదనను
మునిపంటన భరిస్తూ
మరణం అంచుల వరకు వెళ్లినా
మరో జీవికి జన్మనివ్వాలనే
కోరుకుంటుంది అమ్మ
కడుపులో ఉన్నప్పుడు తన్నితే
మురిసిపోయే అమ్మ
మురిపాలు పంచుతూ బిడ్డల
ఎదుగుదలను కోరుతుంది
కానీ,వయసొచ్చిన కొందరు బిడ్డలు
వయస్సు మళ్ళిన
తనను తన్నుతుంటే భరిస్తుంది అమ్మ
ఎందుకంటే , ప్రేమను పంచడమే
తెలుసు ఆమెకు!
బిడ్డల యోగ క్షేమాల కోసం
పరితపించే అమ్మ
వారు చేసే తప్పులను
మదిలో దాచుకుంటూ
పేగుబంధం అల్లరి చేష్టలను
కాచుకుంటూ రక్తబంధాన్ని
మురిపెంగా కాపాడుకుంటూ
మూడుముళ్ల బంధాన్ని సైతం
నిలువరిస్తుంది అమ్మ
తల్లి కావడమే స్త్రీకి పరిపూర్ణతగా
భావించే అమ్మ
తన కడుపు కాలుతున్నా
బిడ్డ ఆకలి తీరుస్తుంది
తనువున్నంత వరకు
పేగు బంధం కోసం
ఆరాటపడుతుంది
తానున్నా లేకున్నా
బిడ్డల బాగును కోరే అమ్మ ...
నీ చల్లని ఒడిలో మొదలైంది
ఈ జన్మ...
నీవు లేకుంటే నేనెక్కడమ్మా ....


– ఎం.వి. రమణ గంధం,
రాజానగరం, **9705347677**

## ఫీల్డ్ విజిట్‌లో లైఫ్ సైన్స్ విద్యార్థులు



సెంట్రల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ (CIFE) కాకినాడ, బలబద్రపురం కేంద్రాలను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం , యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ,ఆక్వాకల్చర్ మరియు జువాలజి విభాగ విద్యార్థులు సందర్శించారు. విద్యా ప్రణాళికలో భాగంగా శుక్రవారం ICAR - CIFE కేంద్రాలైన కాకినాడలోని ఉప్పునీటి ఫిష్ ఫార్మింగ్ మరియు బలబద్రపురంలోని మంచినీటి ఫిష్ ఫార్మింగ్ లను సందర్శించారు. CIFE – కాకినాడ కేంద్రంలోని సైంటిస్ట్ ఇన్ చార్జ్ డా. మురళీధర్ అండే మరియు డా. శ్యామల,డా. శ్రీనివాసరావులు ఉప్పునీటి ఫిష్ ఫార్మింగ్ సిస్టం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. CIFE– బలబద్రపురం కేంద్రంలో CIFE- ముంబయ్ విద్యార్థులు మరియు టెక్నికల్ అసిస్టెంట్ సాంబమూర్తి మంచినీటి చేపలైన బొచ్చె, శీలావతి, మోసు, గడ్డిచేప, రూప్ చంద్ ల పెంపక విధానం మరియు గుడ్లను ఉత్పత్తి చేసి చేప పిల్లలు తయారు చేసే విధానం, నర్సరీ పాండ్, గ్రా అవుట్ పాండ్ల గురించి వివరించారు. మాగూర్ (మార్పు) చేపలపై చేపడుతున్న పరిశోధనలను విద్యార్థులకు వివరించారు. ఆక్వాకల్చర్ విభాగాధిపతి డా.కె.రమణేశ్వరి మాట్లాడుతూ ఇలాంటి ఫీల్డ్ విజిట్స్ విద్యార్థులలో పరిశోధన తృష్ణను పెంచుతాయని అభిప్రాయపడ్డారు . జువాలజీ విభాగాధిపతి డా.పి.విజయనిర్మల , బయోటెక్నాలజీ విభాగాధిపతి డా . ఏ.మట్టారెడ్డి , బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డా.కె.కళ్యాణి మాట్లాడుతూ ఇలాంటి ఫీల్డ్ విజిట్స్ వలన విద్యార్థులలో ప్రాక్టికల్ నాలెడ్జ్ మెరుగతుందని, విద్యార్థులతో సంబంధిత విషయాలపై పూర్తి అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు . ఆక్వాకల్చర్ డిపార్ట్ మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.డి.శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుత విధానాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించటంలో ఇలాంటి ఫీల్డ్ విజిట్స్ ఉపయోగపడతాయని తెలిపారు.

### మంచి మాట



**"మధుమతీమ్ వాచం వదతు శాంతిం వా"**

భాష మానవునికి మాత్రమే లభించిన అతి అరుదైన వరం. భావవ్యక్తీకరణకు భాష మాత్రమే స్పష్టమైన ఆధారం. అందుకే మాట "మధురంగా ఆనందం కలుగజేసేదిగా ఉండాలని అది శాంతిని కలిగిస్తుందని" భారతీయ సాహిత్య ప్రబోధం!!




ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in